క్లుప్తంగా

ఉత్సాహంగా చెస్ పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు సిటీ: నగర శివారులోని ఎడిఫై వరల్డ్ స్కూల్, కర్నూలు జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ సంస్థ సంయుక్తంగా ఆదివారం ఆ స్కూల్‌లో జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఎడిఫై స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ జోసెఫ్ డేవిడ్ పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. చెస్ పోటీల ద్వారా మేధస్సు పెరుగుతుందన్నారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ మనోజ్‌కుమార్, సతీష్‌కుమార్, గాంధీ రెడ్డి అభినందించారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ స్టిక్కర్లను అతికిస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దని సీఐటీయూ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు సుధాకరప్ప, ఎస్‌ఎండీ షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ న్యూసిటీ, ఓల్డ్‌సిటీ కమిటీల ఆధ్వర్యంలో ముజఫర్ నగర్, సాయిబాబా నగర్‌లో స్మార్ట్ మీటర్లను వెనక్కు తీసుకోవాలని, విద్యుత్ బిల్లులను తగ్గించాలని కోరుతూ ముద్రించిన స్టిక్కర్లను ఇంటింటా అతికించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబునాయుడు.. అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను బిగించడం అన్యాయమన్నారు. వెంటనే పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాలని కోరారు.

ముళ్ల పొదల తొలగింపు



ఇందిరమ్మ కాలనీలో జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): జొహరాపురం ఇందిరమ్మ కాలనీలో కమ్యూనిటీ భవనాల ప్రాంగణంలో పెరిగిన ముళ్ల పొదలను ఆదివారం నగరపాలక పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో తొలగించారు. పనులను నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల క్రితం ఇందిరమ్మ కాలనీలో వివిధ కులాలకు చెందిన 18 కమ్యూనిటీ భవనాలను నిర్మించినట్లు చెప్పారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఈ నెల 6న మంత్రి టీజీ భరత్ నిర్వహించిన సమావేశంలో కమ్యూనిటీ భవనాలను ప్రజలు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఘనంగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కర్నూలు కల్చరల్: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో వెంగమాంబ జయంతి వేడుకలు, నరసింహ చతుర్దశి కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. కర్నూలు బుధవారపేట శ్రీ సూర్య కళా కల్చరల్ అకాడమీ నిర్వాహకులు సుధాకర్ బృందం ఆలపించిన వెంగమాంబ, అన్నమాచార్యుల సంకీర్తనలు అలరించాయి. కర్నూలు వేంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం అధ్యక్షులు నాగమల్లీశ్వరమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. మాతృశ్రీ వెంగమాంబ జీవిత విశేషాలను లలితాపీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి వివరించారు. ముత్తైదువులకు పసుపు కుంకుమ, ఫలహారాలను అందజేశారు. సేవా సమితి అధ్యక్షుడు పసుపులేటి నీలిమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లలితా పీఠం, తరిగొండ వెంగమాంబ సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా శేషసాయి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా శేషసాయి నియమితులయ్యారు. ఆయన నగర పాలక సంస్థ వాటర్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ప్రజారోగ్య సాంకేతిక శాఖ చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర్ రావు సీనియారిటీ ప్రాతిపదికన ఆయన్ను నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఈ రాజశేఖర్‌ను తప్పించి చీఫ్ ఇంజినీర్‌కు రిపోర్టు చేసుకోవాలని రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఖాళీగా ఉన్న ఈ పోస్టులో పాలనపరమైన ఇబ్బందులు రాకుండా పూర్తి స్థాయి బాధ్యతలతో ఎస్‌ఈని నియమించారు.

దాడులతో డైవర్షన్ పాలిటిక్స్

- కూటమి ప్రభుత్వం అరాచక పాలన
- మాజీ మంత్రి విడుదల రజినిపై పోలీసుల దురుసు ప్రవర్తన దారుణం
- రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు
- కొందరు పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు

కల్లూరు: పాలనలో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నేతలపై దాడులు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి విడుదల రజిని పట్ల పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, సీఎం చంద్రబాబు ప్రతిపక్ష పార్టీలను ఎలా కట్టడి చేయాలి, ఎలా కక్ష తీర్చుకోవాలనే విషయాలపై దృష్టి పెట్టారన్నారు. కొందరు అధికారులు, పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారన్నారు. పల్నాడు జిల్లాలోని మానుకొండ వారి పాలెంలో ఓ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి విడుదల రజినిపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడటం సరి కాదన్నారు. తన అనుచరుడు శ్రీకాంత్‌ను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని ప్రశ్నించిన విడుదల రజిని పట్ల చిలకలూరుపేట రూరల్ సీఐ సుబ్బారాయుడు అనుచితంగా ప్రవర్తించిన తీరు దారుణమన్నారు. మహిళల పట్ల కొందరు పోలీసులు అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తున్న తీరును ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. అలాగే ఈ నెల 9న కంతేరు గ్రామ వైఎస్సార్‌సీపీకి చెందిన కల్పన అనే దళిత మహిళను తెల్లవారు జామున 3 గంటల సమయంలో 20 మంది పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేశారన్నారు.దుస్తులు మార్చుకుని వస్తానని ఆమె కోరినా పోలీసులు వినిపించుకోలేదని, అయితే ఉదయం 6.30 గంటలకు అరెస్టు చేశామని కోర్టును సైతం తప్పుదోవ పట్టించారన్నారు. నిర్బంధాలు, అణిచివేతతో వైఎస్సార్‌సీపీని అడ్డుకోవాలని చూస్తే భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు,దాడులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కనపడటం లేదా? అని ప్రశ్నించారు.

ప్రశ్నించిన వారిపై కేసులు..

ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియాలో ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం ఎంత వరకు న్యాయమని కాటసాని ప్రశ్నించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు గాలికి ఎగిరిపోయాయన్నారు. చంద్రబాబు మోసం చేస్తున్న తీరును సామాజిక మాధ్యమాల ద్వారా నిలదీస్తున్న వారిని వ్యక్తిగతంగా హింసించేందుకు తెగబడ్డారన్నారు. డిప్యూటీ మేయర్ రేణుక, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జోనల్ విభాగం అధ్యక్షురాలు గాజుల శ్వేతా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల పట్ల పోలీసులు ప్రవరిస్తున్న తీరు దారుణమన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అరుణ, నారాయణ రెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళ నేతలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాల ఊసే లేదు..

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా రాష్ట్రంలోని ప్రజలకు ఒరిగిందేమీ లేదని కాటసాని విమర్శించారు. తల్లికి వందనం, యువతకు ఉద్యోగాలు, అన్నదాతకు పెట్టుబడి సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీల అమలు ఊసే లేదన్నారు. పథకాలు అందించకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు.

విద్యను ప్రైవేటు పరం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం విద్యను ప్రైవేటు పరం చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల్లో యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనమని వివరించారు. ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీఏ ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఫీజులను పెంచుతున్నా ఎవరూ చర్యలు తీసుకోవడం లేదన్నారు. పైగా ఇంటర్ బోర్డులో నారాయణ అధ్యాపకులకు సభ్యత్వం ఇచ్చారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. మరోవైపు యథేచ్ఛగా సెలవు రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. సెలవులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటామని స్వయంగా విద్యార్థులే ప్రకటించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కార్పొరేట్ విద్యా సంస్థల ఎదుగుదల కోసమే మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని విమర్శించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప, నాయకులు సాయి ఉదయ్, శ్రీనివాసులు, అబూబకర్, మల్లేష్, రాము పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు ఆయన వివరించారు.

అర్జీల సమాచారం కోసం 1100

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు సమర్పించిన దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు సూచించారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

నేడు నగరపాలక సంస్థలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైనికుల రక్షణ కోసం ప్రార్థనలు



చర్చిలో జాతీయ జెండాలు పట్టుకొని ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కర్నూలు (టౌన్): భారత – పాకిస్తాన్ మధ్య జరుగుతున్న దాడుల్లో భారత సైనికుల రక్షణ కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం నగర శివారులోని బి.తాండ్రపాడు ఎస్సీ కాలనీలోని చర్చిలో భారత సైనికులకు అండగా నిలుద్దామంటూ జాతీయ జెండాలు చేతబట్టి ప్రార్థనలు చేశారు. వీరమరణం పొందిన సైనికుల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ అన్ని చర్చిల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మినిస్ట్రీస్ సభ్యులు క్రిస్టఫర్, రాజేష్, క్రైస్తవులు పాల్గొన్నారు.

14 నుంచి యేసుక్రీస్తు సువార్త సభలు

ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నగర శివారు బి.తాండ్రపాడులోని ఎస్సీ కాలనీలో ప్రత్యక్ష సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ జి.రవికుమార్ వెల్లడించారు. ఈ సువార్త సభల్లో అంతర్జాతీయ వర్తమానికులు బ్రదర్ కిరణ్‌పాల్, బ్రదర్ పి.జేమ్స్, రెవరెండ్ ఆర్.ఆర్.డీ. సజీవరాజు పాల్గొంటున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని దేవుడి ఆశీర్వాదం పొందాలని పిలుపునిచ్చారు.

సైన్యానికి ప్రజల మద్దతు అవసరం



భరత మాత చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: భారత సైన్యానికి ప్రజల మద్దతు, ప్రోత్సాహం ఎంతో అవసరమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య అన్నారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జై జవాన్ కల్చరల్ ఫెస్టివల్‌లో భాగంగా రెండో రోజు ఆదివారం దేశ భక్తి నృత్య ప్రదర్శనలు, గేయాల ఆలాపన జరిగింది. భరత మాత చిత్రపటానికి సైనిక వేషధారణలోని కళాకారులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని ప్రధాన మంత్రి చెప్పారన్నారు. దేశంలో యుద్ధ వాతావరణం ఇంకా ముగియ లేదన్నారు. అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నాట్యాచార్యులు నారాయణ స్వామి శిష్య బృందం నృత్య ప్రదర్శనలు, చంద్ర కంటి మద్దయ్య, బాల వెంకటేశ్వర్లు బృందం దేశ భక్తి గీతాలాపన దేశ భక్తిని రగిల్చాయి. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సిలంబం శిక్షణతో ఆత్మస్థైర్యం

కర్నూలు (టౌన్): సిలంబం (కర్రసాము) శిక్షణతో ఆత్మస్థైర్యం పెరుగుతుందని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక బాల శివ డిగ్రీ కళాశాల మైదానంలో సిలంబం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రతి రోజు శారీరక క్రీడల్లో పాల్గొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అలాగే అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సిలంబం కార్యదర్శి రాఘవేంద్ర పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు.. సృజనాత్మక వేదికలు



విద్యార్థులకు బిస్కట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: వేసవి ప్రత్యేక శిబిరాలు సృజనాత్మక వేదికలని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను ఆమె ఆదివారం పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం, కథలు చెప్పడం, డ్రాయింగ్, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, పెయింటింగ్ తదితర అంశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా శిక్షణ పొందుతున్నారన్నారు. లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాషా, విశ్రాంత ఉద్యోగులు గోపాలకృష్ణ, విశ్రాంత ప్రొఫెసర్ హనుమంతప్ప, ఎన్‌జీఓ నాయకులు మద్దిలేటి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రామచంద్రయ్య, శ్రీనివాసులు, సురేష్, శేషయ్య, విజయ నరసింహయ్య తదితరులు విద్యార్థులకు బిస్కెట్స్ పంపిణీ చేశారు.

యువకీర్తి ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మీసాల రఘు

కర్నూలు కల్చరల్: దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన యువ రచయిత మీసాల రఘు యువకీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరులో జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో కళావేదిక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా మీసాల రఘు పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాషా, సాహిత్యం, తెలుగు వైభవం, సంస్కృతి సంప్రదాయాలు, కళల పరిరక్షణ, అభివృద్ధికి సాహిత్యం, కళా రంగం ద్వారా చేస్తున్న సేవలకు గుర్తింపుగా పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన

కర్నూలు(హాస్పిటల్): సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని సీహెచ్‌ఓలు తెలిపారు. కర్నూలులోని ధర్నా చౌక్‌లో కొనసాగుతున్న వీరి ఆందోళన ఆదివారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏపీ ఎంసీఏ అధ్యక్షురాలు చందన, వర్కింగ్ ప్రెసిడెంట్ గురుప్రసాద్ మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం తాము సమ్మె బాట పట్టామని, ఈ మేరకు ఏడు నెలల ప్రోత్సాహకాల బకాయిలను ప్రభుత్వం ఈ నెల 9వ తేదీన విడుదల చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు హర్షణీయమన్నారు. ఇతర డిమాండ్లు వేతన సవరణ, ప్రావిడెంట్ ఫండ్ వంటివి కూడా పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ మేరకు అసోసియేషన్ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరిపి స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ఇదిలాఉండగా లద్దగిరి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ శాంతకుమారి వారి ధర్నాకు మద్దతు తెలిపి యూనియన్‌కు రూ.5 వేలు విరాళంగా అందజేసినట్లు తెలిపారు.

మే 20న జరిగే సమ్మెకు సహకరించండి

కర్నూలు(సెంట్రల్): మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సహకరించాలని కోరుతూ నవత ట్రాన్స్‌పోర్టు మేనేజర్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఆదివారం వారు మేనేజర్‌ను కలిసి హమాలీలు సమ్మెలో పాల్గొనేందుకు అనుమతించాలన్నారు. కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెకు అన్ని వర్గాల నుంచి మద్దతు కోరుతున్నట్లు చెప్పారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



స్కానింగ్ పరీక్ష చేస్తున్న డాక్టర్ లక్ష్మణస్వామి

కర్నూలు(హాస్పిటల్): కుటుంబంలో అందరికంటే తల్లికే పిల్లల ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ ఉంటుందని, తల్లిని మించిన దైవం లేదని సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ టి.లక్ష్మణస్వామి అన్నారు. మదర్స్ డే సందర్భంగా ఆదివారం స్థానిక వెంకటరమణ కాలనీలోని శ్రీ కైలాస స్పెషాలిటీ క్లినిక్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లులకు, తల్లులవుతున్న వారికి ఉచిత వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోజూ అరగంట నుంచి గంట పాటు వ్యాయామం చేయాలని, మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలని, ఆహారంలో పండ్లు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలన్నారు. రేడియాలజిస్టు నిహారిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో సోమవారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే పోటీలను స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన జట్లకు తొలి నాలుగు స్థానాలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల కబడ్డీ క్రీడాకారులు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి జట్ల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99514 39993, 98495 29343, సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో నరసింహ చతుర్దశి



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీ జగన్నాథ మందిరంలో ఆదివారం నరసింహ చతుర్దశి మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగన్నాథ స్వామికి ప్రత్యేకంగా నృసింహ స్వామిగా అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. నరసింహ హోమం, హరి నామ సంకీర్తన జప యజ్ఞం, తులసి హారతి, గౌరా హారతి, తులసి అర్చన, రాజభోగ నివేదన చేశారు. ఇస్కాన్ ప్రవచకులు హేమ హరి ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. కర్నూలు రాఘవేంద్ర నగర్‌లోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం బుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన బుద్ధ భగవానుడి విగ్రహాన్ని టీజీ, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. మహనీయుల నుంచి స్ఫూర్తి పొందేందుకు వారి విగ్రహాలను ఏర్పాటు చేస్తూ ఉంటామన్నారు. పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్యాత్మిక రంగంలో అందరికీ ఆదర్శంగా మారిందన్నారు. ఇది మొదటి పిరమిడ్ కేంద్రం కావడం అభినందనీయమన్నారు. పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

వీసీకి సన్మానం



డాక్టర్ చంద్రశేఖర్‌తో పాస్టర్ జేబేజ్ వాట్స్, చర్చి సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను ఆదివారం కర్నూలులో బెత్లహేము మినిస్ట్రీస్ (ఎ.క్యాంపు) వారు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. రాయలసీమలో వెనుకబడిన కోడుమూరు నియోజకవర్గంలోని ప్యాలకుర్తి గ్రామం నుంచి డాక్టర్ చంద్రశేఖర్ వీసీ స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. పాస్టర్ జేబేజ్ వాట్స్, చర్చి సభ్యులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమకు న్యాయం జరిగింది

సీనియర్ కార్డియాలజిస్టు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రిటైర్డ్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.చంద్రశేఖర్‌కు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పదవి దక్కడంతో రాయలసీమకు న్యాయం జరిగిందని ఆయత్ ఫౌండేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా చెప్పారు. ఈ మేరకు డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆయన నివాసంలో ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. టీడీపీ నాయకులు రుస్తుం ఖాన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ్మోహన్‌రెడ్డి, వేగా ఫౌండేషన్ అధ్యక్షుడు బోరెల్లి వెంకటరాముడు, నాగేశ్వరబాబు పాల్గొన్నారు.

కష్టపడే వారికే పదవులు



వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన శ్రావణ్‌కుమార్, అనుబంధ విభాగాల కర్నూలు నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులుగా నియమితులైన కె.నరేంద్ర ఆదివారం సాయంత్రం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో పదవులు పొందిన వారందరూ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. అందరూ సమన్వయంగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.